క్లుప్తంగా

ఉత్సాహంగా త్రోబాల్ పోటీలు

తుని: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రంగం యువజనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన త్రోబాల్ పోటీలకు అనూహ్య స్పందన లభించిందని రోటరీ క్లబ్ యూత్ యాక్టివిటీస్ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ డాక్టర్ టి.నాగిరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన త్రోబాల్ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 30 జట్లు పాల్గొన్నాయి. సీనియర్స్ విభాగంలో విజేతలుగా లయోలా స్కూల్, ద్వితీయ స్థానంలో ఏపీ రెసిడెన్షియల్ జగన్నాథగిరి, జూనియర్స్ విభాగంలో శ్రీప్రకాష్ ప్రథమ, ద్వితీయ స్థానంలో లయోలా స్కూల్ నిలిచాయన్నారు. రోటరీ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు సీహెచ్ మంగరాజు, ప్రోగ్రాం కమిటీ వైస్ చైర్మన్ జె.రమేష్ నాయుడు, వర్మ, గణేష్, మధుసూదన్, రామ చంద్రారావు, రమేష్, సాత్విక, శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలుంటే చికిత్స పొందాలి



బాలికలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

గోకవరం: విద్యార్థులకు ఆరోగ్య సమస్యలుంటే వైద్యులు సలహా మేరకు తగు చికిత్స పొందాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డీఎస్ మూర్తి సూచించారు. గోకవరం జెడ్పీ హైస్కూల్లో శనివారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ స్కూల్స్‌లో పిన్ పాయింట్ ప్రకారం ఈ కార్యక్రమం అమలు జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు సహకరించి పిల్లలకు హిమోగ్లోబిన్, వివిధ వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు గౌరమ్మ, చిమ్మరాజు దొర, ఎంపీహెచ్ఈఓ ఎస్.శంకర్, హెచ్ఎం సత్యనారాయణరెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బూత్ కమిటీల ఎన్నికలు త్వరగా పూర్తి చేయాలి



ప్రత్తిపాడులో మంగరాజును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు: భారతీయ జనతా పార్టీ బూత్ లెవెల్ కమిటీల ఎన్నికలు ఈ నెల 25వ తేదీలోగా పూర్తి చేయాలని బీజేపీ జిల్లా బూత్ కమిటీల ఎన్నికల అధికారి మట్ట మంగరాజు సూచించారు. స్థానిక బీజేపీ కార్యాయలంలో శనివారం సాయంత్రం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ మండలంలోని పలు బూత్‌ల్లో 65 శాతం పైబడి పార్టీ సభ్యత్వ నమోదు పూర్తయ్యిందన్నారు. బూత్ కమిటీలను త్వరగా ఎన్నుకోవాలని సూచించారు. అనంతరం మంగరాజును పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు తదితరులు శాలువాతో సత్కరించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, పార్టీ నాయకులు కామినేని జయశ్రీ, కించు జోగిరాజు, కందా వీరాస్వామి, ఊటా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు మఠంలో అన్నసమారాధన

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు మఠంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. దాతలు వట్టూరి వీవీ సత్యనారాయణ, పాలకుర్తి శ్రీను, కొర్నాల రాంబాబు, బొడ్డు రామమూర్తి, మద్దిపూడి వీర్రాజు కుంటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో భక్తులకు అన్నదానం చేసినట్టు జీయర్ శాశ్వత అన్నదాన నిధి కమిటీ సభ్యులు తెలిపారు. తొలుత భక్తులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నారాయణస్వామికి సన్మానం




ఏలేశ్వరంలో నారాయణస్వామిని సన్మానిస్తున్న తూర్పుకాపు సంఘ నాయకులు

ఏలేశ్వరం: తూర్పుకాపు రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామిని పట్టణంలో శనివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఆయన ఇంటి వద్ద మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో సత్కరించారు. కౌన్సిలర్లు పెంద్ర శ్రీను, యండగండి నాగబాబు, రాయుడు చిన్నా తదితరులు పాల్గొన్నారు. అలాగే తూర్పుకాపు సంఘ నాయకులు కూడా నారాయణస్వామిని శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో సామంతుల భాస్కరరావు, కర్రోతు గాంధీ, శిడగం రామకృష్ణ, దత్తి కిషోర్, శిడగం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సొంత గూడు కరవు

- పంచాయతీలకు సొంత భవనాలు లేని వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- కమ్యూనిటీ హాళ్లు, ఇతర ప్రభుత్వ భవనాల్లో కార్యకలాపాలు



రాఘవపట్నంలో అసంపూర్తిగా నిలిచిపోయి తుప్పలు, పొదలతో దర్శనమిస్తున్న పంచాయతీ కార్యాలయ భవనం

రౌతులపూడి: మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. పంచాయతీ కార్యకలాపాలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు, అధికారులు సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. గ్రామ పాలనకు కమ్యూనిటీ భవనాలు, రామాలయాలు, పాడుపడిన ఇతర ప్రభుత్వ భవనాలను వినియోగించుకుంటున్నారు.

మండలంలో 26 గ్రామ పంచాయతీలు

రౌతులపూడి మండలంలో గతంలో 20 పంచాయతీలుండేవి. శివారు గ్రామాలకూ సుస్థిరమైన పాలన అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హత కల్గిన శివారు గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగానే మూడేళ్ల క్రితం మండలంలోని కొత్తగా మల్లంపేట, ఉప్పంపాలెం, బీబీ పట్నం, డీజే పురం, కోడూరు, మెరక చామవరం గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం మండలంలో 26 గ్రామ పంచాయతీలున్నాయి. పంచాయతీలుగా ఏర్పడి మూడున్నరేళ్ల గడిచినా నేటికీ ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. దీంతో కమ్యూనిటీ భవనాలు, రామాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయ భవనాల్లో పంచాయతీ నిర్వహణ చేపడుతున్నారు.

అసంపూర్తిగా భవన నిర్మాణాలు

మండలంలోని రాఘవపట్నం, ములగపూడి గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల నిర్మాణాలకు రూ.లక్షల నిధులు మంజూరు చేశారు. అయితే ఆయా భవనాలు నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేశారు. నేటికీ వాటి నిర్మాణాలు పూర్తిచేయక పోవటంతో భవనాలు గోడలు, గదుల్లో తుప్పలు, చెట్లు పెరిగిపోయి నిర్లక్ష్యంగా పడి ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లు, పాఠశాల భవనాలు, చెట్ల కింద సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.

భవనాలు ఉన్నప్పటికీ ఇబ్బందులు

మండలంలోని మేజరు పంచాయతీ రౌతులపూడి, బలరామపురంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యాలయ భవనాల్లో ఇతర కార్యాలయాల నిర్వహణ చేపడుతున్నారు. రౌతులపూడి పంచాయతీ కార్యాలయ భవనంలో ప్రస్తుతం పోలీస్ స్టేషన్ నిర్వహణ చేపట్టగా బలరామపురం పంచాయతీ భవనంలో సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఆ రెండు గ్రామాల్లో సైతం పంచాయతీ కార్యకలాపాల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు.



ఎస్.అగ్రహారంలో శిథిలమైన పంచాయతీ కార్యాలయ భవనం

కూలేందుకు సిద్ధంగా..

గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యాలయాలు భవనాలు పూర్తిగా శిథిలమై కూలేందుకు సిద్ధం ఉన్నాయి. మండలంలోని లచ్చిరెడ్డిపాలెం, ఎస్ఎన్ పట్నం, ఎస్.అగ్రహారం, బంగారయ్యపేట గ్రామ పంచాయతీ కార్యాలయాలు గడిచిన పదేళ్లలో పూర్తిగా శిథిలమయ్యాయి. ఆయా భవనాలు శ్లాబ్ పెచ్చులు ఊడిపడి వర్షం నీరు లోపలికి వస్తోంది. దీంతో కార్యాలయాల్లో రికార్డులు తడిసిపోతున్నాయని పాలకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీలకు నూతన భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.

సొంత భవనం లేక అవస్థలు



గత ప్రభుత్వం చొరవతో కొత్తగా పంచాయతీ ఏర్పడి మూడున్నరేళ్లు గడిచినా నేటికీ సొంత భవనం లేదు. గ్రామంలోని కమ్యూనిటీ భవనంలో పంచాయతీ కార్యాలయ నిర్వహణ చేపడుతున్నాం. పంచాయతీ సమావేశాలు, గ్రామ సభలను కమ్యూనిటీ భవనం వద్దే టెంట్‌లు ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్నాం. గ్రామ పంచాయతీ భవనం కోసం మండల పరిషత్ సమావేశాల్లో అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు.దీంతో ఇబ్బందులు తప్పడం లేదు.

– పోలుపర్తి సీత, సర్పంచ్, మల్లంపేట, రౌతులపూడి మండలం

భవనం పూర్తిగా శిథిలమైంది



మా గ్రామంలోని పంచాయతీ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలమైంది. భవనం పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షం నీరు కార్యాలయంలోకి రావడంతో అవస్థలు తప్పడం లేదు. దీంతో చేసేది లేక స్థానికంగా ఉన్న సచివాలయంలోనే పంచాయతీ కార్యాలయ నిర్వహణ చేపడుతున్నాం. ప్రభుత్వం స్పందించి కొత్తభవనం మంజూరు చేయాలి.

– నర్సం శ్రీనివాస్, సర్పంచ్ ఎస్.అగ్రహారం, రౌతులపూడి మండలం

మీకు దమ్ముంటే నాపై కేసులు పెట్టండి

- యనమల కృష్ణుడి సవాల్



తుని: దేశ వ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా కార్యకర్తలు ఉన్నారని, రాష్ట్రంలో మాత్రం వైఎస్సార్ సీపీకి చెందిన వారిపై పోలీసులతో అక్రమ కేసులు పెట్టించడం అన్యాయమని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు అన్నారు. 'మీకు దమ్ము, సత్తా ఉంటే నాపై కేసులు పెట్టండి' అని సవాల్ చేశారు. తునిలోని ఆయన నివాసంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుల వద్ద పని చేసే చిరు జీతగాళ్లపై పోలీసులతో అక్రమ కేసులు పెట్టించడం, ఉదయం, సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి చిత్రహింసలకు గురి చేయడం సరికాదన్నారు. మీతో పాటు 40 ఏళ్ల కలిసి రాజకీయంగా నడిచాను, ఇలాంటి చౌకబారు రాజకీయాన్ని తాను చూడలేదన్నారు. మా ఇళ్లలో పని చేసే డ్రైవర్లు, వంటవాళ్లపై కేసు పెడతారా ? మీకు దమ్ముంటే నాపై పెట్టి చూడండని ఘాటుగా స్పందించారు. జనసేన ఓట్లతో గెలిచిన మీరు ఆ పార్టీకి చెందిన నాయకులు గౌరవం ఇవ్వడం లేదని, నాలుగు నెలల వ్యవధిలోనే మీ రాజకీయ చతురత ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నామని చులకనగా చూడవద్దన్నారు. కార్యకర్తలకు అండగా నిలబడతామని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు కేసులకు భయపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తప్పు చేస్తే కేసులు పెట్టండంటి తప్పు ఎవరో చెబితే అమాయకులను ఇబ్బంది పెట్టవద్దని పోలీసులను కోరారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి

తొండంగి: బాలలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి అన్నారు. మండలంలోని వాకదారిపేటలో శనివారం జిల్లా మహిళాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సంయుక్త ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా నవంబర్ 14 నుంచి 20 వరకూ బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బాలలపై జరుగుతున్న అత్యాచారాలను, బాల్య వివాహాలు, లైంగిక వేధింపుల నివారణకు అందరూ కృషి చేయాలన్నారు. బాలల హక్కులను పరిరక్షించేందుకు ఐక్యరాజ్యసమితి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలలకు జీవించే హక్కు, అభివృద్ధి చెందేహక్కు, రక్షణ పొందే హక్కు, సమాజ హిత, సేవా కార్యక్రమాల్లో పాల్గొనే హక్కు ఉన్నాయన్నారు. బాలల హక్కులకు భంగం కలిగితే 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. చైల్డ్‌హౌస్ మేనేజర్ నూకరత్నం బాలల దత్తతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ రాజేశ్వరి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరు గ్రామానికి చెందిన రోడ్డు ప్రమాద బాధితుడికి వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన దక్కుమాలి దొరబాబు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మురళీరాజు శనివారం బాధితుడిని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొండి రాంబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు శెట్టి సత్యనారాయణ, పంచాది చంటిబాబు, చెక్కపల్లి నాగేశ్వరరావు, జువ్వల బాబులు, నానిపల్లి చంటి పాల్గొన్నారు.

వ్యర్థాల రీసైక్లింగ్‌తో సుస్థిరాభివృద్ధి



పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రసాద్

తుని: రోజువారీ వచ్చే వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం ద్వారా పర్యావరణ సుస్థిర అభివృద్ధి సాధించవచ్చని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ డైరెక్టర్ (రిటైర్డ్) డాక్టర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్ సూచించారు. స్థానిక శ్రీప్రకాష్ డిగ్రీ కళాశాలలో శనివారం పర్యావరణ సమస్యలు సుస్థిర అభివృద్ధి అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి సాధించాలంటే ఆర్థిక, సామాజిక అభివృద్ధితో పాటు మానవ అభివృద్ధి జరగాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శిలాజ ఇంధనాల నుంచి ఇంధనం వేరు చేసే ప్రక్రియలో కాలుష్యం ఎక్కువగా జరుగుతోందన్నారు. ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తి, పవన శక్తి, హైడ్రోజన్ శక్తిని వినియోగించుకోవాలని సూచించారు. యువత ప్లాస్టిక్ వ్యర్థాలను నియంత్రించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, శాస్త్రవేత్త ఎల్.నగేష్, శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులకు స్వామివారి చిత్ర పటం అందజేస్తున్న ఆలయ మాజీ చైర్మన్ అచ్చన్నదొర

గోకవరం: మండలంలోని తంటికొండలో ప్రసిద్ధగాంచిన వేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. సుమారు 8 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. అయ్యప్పమాల ధరించిన సుమారు 100 మంది భక్తులు స్వామివారి దర్శనానికి పాదయాత్రగా వచ్చారు. పండితులు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. దాత చింతల నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించినట్టు దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



బవురువాకలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఉమర్ ఆలీషా తదితరులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని బవురువాకలో పేదలకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. పిఠాపురానికి చెందిన శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో సుమారు 100 మంది దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా మాట్లాడుతూ బవురువాకను ఆంధ్రా కశ్మీర్‌గా అభివర్ణించారు. పచ్చదనంతో నిండిన కొండలు, ఔషధ మొక్కలు ప్రజలకు ఆరోగ్యం చేకూర్చుతాయన్నారు. తన తండ్రి బ్రహ్మశ్రీ మోహిద్దీన్ బాషా నడయాడిన ఈ ప్రదేశాన్ని పుణ్య క్షేత్రంగా తీర్చి దిద్దుతామన్నారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు అహ్మద్ ఆలీషా, మహబూబ్ పాషా, కబీర్ షా, హుస్సేన్ షా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన



తాటియాకులపాలెం సముద్రతీరంలో ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

తొండంగి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని తాటియాకులపాలెం బీచ్‌లో శనివారం మత్స్యకారులు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో తునిరూరల్ సీఐ చెన్నకేశవరావు, తొండంగి ఎస్సై జగన్మోహన్‌రావు, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడారు. తీరప్రాంతంలో దివీస్, తదితర పరిశ్రమల ఏర్పాటు కారణంగా వందలాది కుటుంబాల జీవనోపాధికి నష్టం వాటిల్లుతోందన్నారు.పైపులైన్ పనులను అడ్డుకున్నారు. తీర గ్రామాల్లో తాగునీరు, డ్రైన్లు, కల్యాణ మండపం ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు స్థానికులకు పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని కోరారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఒంటిమామిడి సర్పంచ్ అంగులూరి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



కిర్లంపూడిలోని ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

కిర్లంపూడి: విత్తనాలు, పురుగు మందుల దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖ అధికారి జోకా అమృత హెచ్చరించారు. కిర్లంపూడి, ఎస్.తిమ్మాపురం గ్రామాల్లోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందు షాపుల్లో కరప సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాబురావుతో కలిసి శనివారం తనిఖీలు నిర్వహించారు. కిర్లంపూడిలోని రైతువాణి షాపులో అనధికారికంగా రూ.8.5 లక్షలు విలువైన పురుగు మందులు ఉండడంతో వాటి విక్రయాలు నిలిపివేశారు. ఈ సందర్భంగా అమృత మాట్లాడుతూ ఎరువుల షాపుల్లో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలన్నారు. స్టాక్ వివరాలు, బిల్లు పుస్తకాల నిర్వహణలో పారదర్శకత లేకుంటే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపుల వద్ద రేట్లు తెలిపే పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏఓ పడాల వెంకటలక్ష్మి, ఏఈఓ సురేష్, వీఏఏ రామకృష్ణ పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చకుండా రోడ్డు నిర్మించాలి



పెదమల్లాపురంలో బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎంపీపీ పర్వత రాజబాబు

శంఖవరం: ఇళ్లు కూల్చి వేయకుండా రోడ్డు నిర్మించాలని తహసీల్దార్ పోతురాజుకు సూచించినట్టు ఎంపీపీ పర్వత రాజబాబు తెలిపారు. మండలంలోని పెదమల్లాపురంలో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా 20 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లను కూల్చివేసిన ప్రాంతాన్ని శనివారం ఎంపీపీ రాజబాబు పరిశీలించారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మల్లాపురం సర్పంచ్ గుండు నాగదేవి, గౌరంపేట సర్పంచ్ ఏసుబాబు, మాజీ జెడ్పీటీసీ ఈగల అప్పారావు, మాజీ ఎంపీటీసీ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



జగ్గంపేటలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలేశ్వరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయ వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనడం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందన్నారు. పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

కిర్లంపూడి మండలంలో...

కిర్లంపూడి: విద్యార్థులు చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వీరవరం గ్రంథాలయాధికారి వి.వెంకటేశ్వరరావు సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కిర్లంపూడి, గెద్దనాపల్లి, వీరవరం గ్రంథాలయాల్లో శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

జగ్గంపేట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అపార్ నమోదులో నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కుమార్ బాబు

ప్రత్తిపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి విద్యార్థికి అపార్ నమోదు చేయడంతప్పనిసరి అని, ఆ విషయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు నిర్లక్ష్యం చేయడం తగదని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 నుంచి 12వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి అపార్ నమోదు తప్పనిసరి అన్నారు. అపార్ నమోదు చేస్తే విద్యార్థికి ఒక ధ్రువీకరణ నంబర్ వస్తుందని, ఇది భవిష్యత్తులో విద్యార్థుల ఉన్నత చదువులకు అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థికి అపార్ నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అపార్ నమోదులో నిర్లక్షం వహిస్తే యాజమాన్యాలపై చర్యలకు వెనకాడమని హెచ్చరించారు. అపార్ నమోదులో ప్రతిబంధకంగా ఉన్న ఆధార్ కార్డులో తప్పులను సరిచేసేందుకు గానూ ఇప్పటికే మండలంలో ప్రత్తిపాడు, ఒమ్మంగి, లంపకలోవ గ్రామాలో ఆధార్ కేంద్రాలున్నాయన్నారు. ఆధార్ సమస్యలు ఎక్కువగా ఉన్న పాండవులపాలెం, చింతలూరు గ్రామాల్లో మరో రెండు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతులు అందాయన్నారు. ఆ రెండు గ్రామాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు హామీ ఇచ్చారు. మండలవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాల స్థాయిలో 88 శాతం, ప్రైవేటు కళాశాలల్లో 25 శాతం అపార్ నమోదు పూర్తయ్యిందని ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు. సమావేశంలో ఎంఈఓ–2 వై.అచ్చిరాజు, మండల ఇంజనీరింగ్ అధికారి ఎం.సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.